క్లుప్తంగా

10 నుంచి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లిలోని శ్రీభవానిసమేత జంగమేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ వార్షికోత్సవాలు రెండు రోజుల పాటు జరుగుతాయి. 10న ఆదివారం అఖండ దీపారాధన, పార్వతీపరమేశ్వరుల విగ్రహాల ఊరేగింపు, 11న విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, చండీ రుద్రయాగం, మహాన్యాస పూర్వకంగా రుద్రాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. తృతీయ వార్షికోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

అర్వపల్లి : తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలతో జాజిరెడ్డిగూడెం మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్వపల్లి ఎస్‌ఐ బి. అంజిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో కరెంటు స్తంభాలకు, శిథిలమై కూలేదశలో ఉన్న ఇళ్లకు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని సూచించారు.

రాగిజావ, బెల్లం ప్యాకెట్లు వచ్చేశాయ్



రాగిజావ, బెల్లం ప్యాకెట్ల బస్తాలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు డిసెంబర్ నెలకు సంబంధించి రాగిజావ, బెల్లం ప్యాకెట్ల బస్తాలు వచ్చేశాయి. మండలంలోని 34 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు రోజు విడిచి రోజు ఉదయం వేళలో అందించే రాగిజావ, బెల్లం మంగళవారం ఎమ్మార్సీకి రాగా పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు. ఈ నెలకు సంబంధించి 175 కిలోల జావ, 175 కిలోల బెల్లం ప్యాకెట్లు రాగా హెచ్‌ఎంలకు అందజేస్తున్నారు. రోజు విడిచి రోజు పిల్లలకు తప్పనిసరిగా రాగిజావ అందించాలని ఎంఈఓ బాలునాయక్ కోరారు.

మాలధారులకు అన్నదానం

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మంగళవారం మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దాత రామినేని నాగరాజు–నాగజ్యోతి దంపతులు ఏర్పాటు చేశారు. అన్నదానంలో 450మంది మాలధారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాసునాయుడు, బర్మావత్ సీతరాంసింగ్, గడ్డం సూర్యారెడ్డి, నాగరాజు, మాలధారులు పాల్గొన్నారు.

ఆలయానికి మకరతోరణం బహూకరణ

మునగాల : రేపాల గ్రామంలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో విగ్రహానికి గ్రామానికి చెందిన మాచెర్ల రమేష్ -కళ్యాణి దంపతులు రూ.34వేలతో మకరతోరణం చేయించి బహూకరించారు. ఈ సందర్భంగా మంగళవారం వారు ఆలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. స్వామి వారికి మకరతోరణం బహూకరించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకొని ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కాగా దేవాలయం చైర్మన్ శౌంతి పరుశరామయ్య దాతలను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆలయానికి ఎటువంటి ఆదాయవనరులు లేవని, కేవలం భక్తుల సహకారంతో కొనసాగుతుందన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ తోడ్పాటు అందించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ చత్రునాయక్

పాలకవీడు : విద్యార్థులకు మెరుగైన విద్య బోధించాలని, అందుకు ప్రతి ఉపాధ్యాయుడు తమ బోధనలో నైపుణ్యం పెంచుకోవాలని ఎంఈఓ చత్రునాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని జాన్‌పహాడ్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు సరళమైన భాషలో బోధించాలన్నారు. విద్యా విధానాలపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ మండల నోడల్ అధికారి వంగాల రాంరెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఉపేందర్, ఆర్‌పీలు ఎస్‌కే.యూసుఫ్, ధర్మరాజు, ఉపాధ్యాయులు కనకతార, విజిత, రేష్మాబేగం, సంధ్యారాణి, వెంకటేశ్వర్లు, సంబయ్య, గోపి పాల్గొన్నారు.

దర్గా వద్ద వసతులు కల్పించరూ...

- దాతలు నిర్మించిన సత్రాలు శిథిలం
- రోడ్డు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందులు



శిథిలమైన సత్రం గదులు



గుంతలమయంగా ఉన్న దర్గాకు వెళ్లే రోడ్డు

అర్వపల్లి : మతసామరస్యానికి ప్రతీకగా నిలిచి రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచిన అర్వపల్లి శివారులోని హజ్రత్ ఖాజానసీరుద్దీన్ బాబా దర్గా వద్ద కనీస వసతులు కొరవడ్డాయి. నకిరేకల్–తానంచర్ల 365హైవే నుంచి దర్గా వరకు కిలోమీటర్ పొడవు ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. దీంతో ఉర్సుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ రోడ్డును బీటీగా మార్చాలని దర్గా నిర్వాహకులు, భక్తులు ఎంతో కాలంగా అధికారులకు విన్నవించుకుంటున్నారు. కానీ ఇంత వరకు బీటీ రోడ్డుకు నోచుకోలేదు. అలాగే దర్గా వద్ద భక్తుల కోసం గతంలో భక్తుల సహకారంతో రేకుల షెడ్లను సత్రాలుగా నిర్మించారు. ప్రస్తుతం ఈ సత్రాలు కూడా పూర్తిగా శిథిలమై వర్షానికి కురుస్తున్నాయి. ఉర్సు ఉత్సవాలతో పాటు ప్రతి శుక్రవారం ఈ దర్గాకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారు. వీరికి నిలువ నీడలేక ఇబ్బంది పడుతున్నారు. కాగా దర్గా వద్ద గతంలో తాత్కాలికంగా మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. అవి ప్రస్తుతం పనిచేయడంలేదు. దీంతో మహిళలు అవస్థల పాలవుతున్నారు.

వక్ఫ్‌బోర్డు నుంచైనా నిధులు వెచ్చించి..

వక్ఫ్ బోర్డు నుంచైనా నిధులు వెచ్చించి వసతులు కల్పించాలని భక్తులు కోరుతున్నారు. కాగా ఉర్సు ఉత్సవాలు మరో నాలుగు రోజుల్లో మొదలు కానున్నాయి. ఉర్సుకు వేల సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. దర్గాకు వచ్చే భక్తులకు సరైన రోడ్డు వసతి లేకపోవడంతో ప్రతిసారి ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉత్సవాల తొలిరోజు వచ్చే భక్తులు రాత్రి గంధం ఊరేగింపు, ఖవాలి కార్యక్రమాల్లో పాల్గొని అక్కడే బస చేస్తారు. కానీ భక్తులు అక్కడ తలదాచుకోవడానికి ఎలాంటి వసతులు లేవు. దర్గాను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని గతంలో పాలకులు చేసిన హామీలు ఇంత వరకు అమలుకు నోచుకోలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బీటీ రోడ్డు నిర్మించి, వసతులు కల్పించాలని కోరుతున్నారు.

రోడ్డు సరిగా లేక ఇబ్బంది పడుతున్నాం



దర్గా దగ్గరకు వెళ్లడానికి రోడ్డు సరిగా లేక ఇబ్బంది పడుతున్నాం. ప్రస్తుతం ఉన్న మట్టిరోడ్డు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బంది అవుతుంది. ఈ రోడ్డును బీటీ చేస్తే ఇబ్బంది తీరుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దర్గా వద్ద సమస్యలు పరిష్కరించాలి.

– ఆడెపు రవి, నకిరేకల్

దర్గా వద్ద వసతులు కల్పించాలి



గత పదేళ్ల నుంచి దర్గాకు వస్తున్నాం. కానీ ఇక్కడ ఏ సౌకర్యాలు లేవు. రోడ్డు నిర్మించి భక్తులు ఉండటానికి సత్రాలు ఏర్పాటు చేయాలి. సత్రాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో చెట్ల కింద పడుకోవాల్సి వస్తుంది. అలాగే మరుగుదొడ్లు కూడా నిర్మించాలి.

– రమావత్ జానయ్య, సోలిపేట

తుంగతుర్తి చరిత్రలో భారీ మెజార్టీ

తిరుమలగిరి : తుంగతుర్తి నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మందుల సామేల్ విజయం సాధించారు. ప్రతి రౌండ్‌లో కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం కొనసాగింది. మొత్తం 14 మంది రంగంలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మందుల సామేల్‌కు 129535 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌కు 78441 ఓట్లు వచ్చాయి. సామేల్‌కు 51049 ఓట్ల మెజార్టీ సాధించి రికార్డు సృష్టించారు. తుంగతుర్తి నియోజకవర్గం 1952లో ఏర్పడింది. అప్పటి నుంచి ఏ అభ్యర్థి కూడా ఇంత మెజార్టీ సాధించలేదు. 2009లో నియోజకవర్గ పునర్విభజన జరిగిన తరువాత మొదటిసారిగా టీడీపీ అభ్యర్థి మోత్కుపల్లి నర్సింహులు కాంగ్రెస్ అభ్యర్థి గుడిపాటి నర్సయ్యపై 11863 ఓట్లతో విజయం సాధించారు. 2014, 2018 ఎన్నికలు రెండు పర్యాయాలు హోరాహోరీగా సాగాయి. స్వల్ప మెజార్టీతో బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్ విజయం సాధించాడు. ఇప్పుడు ప్రజాతీర్పు కాంగ్రెస్ వైపు ఏకపక్షంగా సాగింది. నియోజకవర్గం చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున భారీ మెజార్టీ లభించడం పట్ల ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎందుకీ రికార్డు..

కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొనడం, స్థానికుడు కావడం, మాదిగ సామాజిక వర్గానికి అధికంగా ఓట్లు ఉండటం, ఆరు గ్యారంటీలను స్థానిక నాయకులు ఇంటింటికీ విస్తృతంగా ప్రచారం చేయడం కాంగ్రెస్‌కు కలిసి వచ్చాయి. దీంతోపాటు బీఆర్‌ఎస్ శాసన సభ్యుడు, ద్వితీయ శ్రేణి నాయకులపై ఇసుక అక్రమ రవాణా ఆరోపణలు, దళిత బంధులో అక్రమాలు జరిగాయని ఆరోపణలు రావడం కాంగ్రెస్ పార్టీ విజయానికి కారణమయ్యాయని పలువురు అంటున్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

నాగారం : ఈటూరు గ్రామానికి చెందిన బోడ అబ్బసాయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా టెక్నోడీడ్ ఐటీ కంపెనీ చైర్మన్ వంగూరి దామోదర్ మంగళవారం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, 50కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వంగూరి సుధాకర్, వంగూరి కుమార్, యలరవి, పేరాల భిక్షం, బొట్టు సురేష్, వంగూరి మహేష్, బోడ సురేష్, పేరాల గోపి, గణేష్ పాల్గొన్నారు.



ఈటూరులో బాధిత కుటుంబానికి బియ్యం అందజేస్తున్న వంగూరి దామోదర్

సీఎంగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడంపై హర్షం

అర్వపల్లి : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఏఐసీసీ ప్రకటించడంపై డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి రేవంత్‌రెడ్డి చేసిన కృషిని కొనియాడారు. ఏఐసీసీ సరైన వ్యక్తిని సీఎంగా గుర్తించిందని చెప్పారు. తుంగతుర్తి ఎమ్మెల్యేగా మందుల సామేల్‌ను అఖండ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, శిగ నసీర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఇవ్వడం హర్షణీయమని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్ష పదవి చేపట్టిన తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, యారాల ఇంద్రసేనారెడ్డి, కన్నెబోయిన వెంకటభిక్షం, నాతి వీరమల్లు, ఎల్మకంటి సోమన్న, కదారి సోమయ్య, దశరథ, వల్లాల భాను, ఎస్‌కే.వలీ, నాయకులు, తదితరులు ఉన్నారు.

నూతనకల్ : తెలంగాణ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఎంపిక చేయడంపై మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై అలుపెరగని పోరాటం కొనసాగించి, కాంగ్రెస్ పార్టీ నాయకులను ఏకతాటి మీదికి తీసుకొచ్చి, పార్టీ విజయానికి కృషి చేసిన రేవంత్‌ను సీఎంగా ప్రకటించడం సంతోషకరమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని తెలియజేసే విధంగా అధిష్టానం సరైన నిర్ణయం తీసుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి క్లెం కృష్ణారెడ్డి, తీగల గిరిధర్‌రెడ్డి, మహేశ్వరం చంద్రకళ, పన్నాల రమామల్లారెడ్డి, బాణాల సుదర్శన్‌రెడ్డి, బత్తుల నాగమల్లు, దరిపెల్లి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

రోజంతా ఎడతెరిపి లేని ముసురు



అర్వపల్లి : దేవాలయం రోడ్డులో నిలిచిన నీళ్లు



అర్వపల్లి : వర్షంలో తడుస్తూనే కూరగాయలు అమ్ముకుంటున్న వ్యాపారులు



నాగారం : బురదమయంగా మారిన పసునూర్ మోడల్ స్కూల్‌కు వెళ్లే దారి

అర్వపల్లి : తుపాను ప్రభావంతో మంగళవారం రోజంతా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్థంభించి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముసురు కారణంగా అర్వపల్లితోపాటు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రోడ్లు, వీధులు బురదమడుగులా మారాయి. వర్షానికి పాత ఇళ్లు నాని కూలే ప్రమాదం ఉండడంతో ఇళ్ల యజమానులు భయాందోళన చెందుతున్నారు.

వార సంతకు వర్షం దెబ్బ

అర్వపల్లిలో ప్రతి మంగళవారం జరిగే వారసంత (అంగడి)లో వర్షానికి వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తుపాను ప్రభావంతో ముసురు కారణంగా వ్యాపారాలు జరగక, సరుకులు తడిసి వ్యాపారులు నష్టపోయారు. అలాగే జీవాల క్రయ విక్రయాలు కూడా నిలిచిపోయాయి.

తిరుమలగిరి : తిరుమలగిరి మండలంలోని వివిధ గ్రామాల్లో ముసురు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

చివ్వెంల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గత రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి జనజీవనం స్థంభించిపోయింది. ఇళ్ల నుంచి ప్రజలు బటయకు వెళ్లలేక ఇంటికే పరిమితమయ్యారు. ఆరుగాలం కష్టించి పండించిన పత్తి వర్షానికి తడుస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో ఇంకా కోయని వరి పొలాలు నేలవాలాయి. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెన్‌పహాడ్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో తుపాన్ ప్రభావం వల్ల సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. కోత దశలో ఉన్న వరిపొలాలు, పత్తి పంటలు తడవటం వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

ఆత్మకూర్(ఎస్) : తుపాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉన్న రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. పలు గ్రామాల్లో కోత దశలో ఉన్న వరిపొలాలు, పత్తి పంటలు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

నూతనకల్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో తుపాన్ ప్రభావం వల్ల మంగళవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. కోత దశలో ఉన్న వరిపొలాలు, పత్తి పంటలు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

మద్దిరాల : తుపాన్ ప్రభావంతో మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం మోస్తరు వర్షం పడింది. దీంతో ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. వరి, పత్తి పంటలు తెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బురద దారితో విద్యార్థుల ఇక్కట్లు

నాగారం : మండల పరిధిలోని పసునూర్ మోడల్ స్కూల్‌కు వెళ్లేదారి పూర్తిగా బురదమయంగా మారడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పసునూర్ స్టేజీ నుంచి సుమారు 400 మీటర్ల దూరంలో పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో సుమారు 740 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ దారి పూర్తిగా కంకరతేలి, గుంతలుపడి, బురదమయంగా మారింది. దీంతో బురదదారి గుండానే విద్యార్థులు పాఠశాలకు వెళ్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పసునూర్ స్టేజీ నుంచి పాఠశాలకు సీసీరోడ్డు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సాయిబాబా ఆలయంలో అనఘాష్టమి వ్రతం



ఆలయంలో అనఘాష్టమి వ్రత పూజల్లో పాల్గొన్న మహిళలు

భానుపురి : కార్తీక మాసం బహుళ అష్టమిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సాయినగర్‌లో గల శ్రీసాయి బాబా మందిరంలో మంగళవారం అనఘాష్టమి వ్రతం నిర్వహించారు. అర్చకులు వలివేటి విశ్వేశ్వరశర్మ, గంగాధర శర్మలు వ్రత పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దత్తాత్రేయుడు సర్వమానవాళికి గురువు అని, గురువు అనుగ్రహంతోనే ఉన్నత విద్యతోపాటు ఉద్యోగంలో పదోన్నతి, సత్వర వివాహం జరుగునని తెలిపారు. అందుకే ఈ వ్రతాన్ని సాయిబాబా ఆలయంలో ప్రతి నెలా బహుళ అష్టమి రోజున నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు సవరాల సత్యనారాయణ, గజ్జల మురళీకృష్ణ, శంకర్ లాల్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

సూర్యాపేట రూరల్ : పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని డీఎస్పీ నాగభూషణం అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం పట్టణ పరిధిలోని రూరల్ పోలీసు స్టేషన్‌ను సందర్శించి మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న పెండింగ్ కేసులు వెంటనే పరిష్కరించేలా చూడాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, రూరల్ ఎస్‌ఐ సాయిరాం, ఏఎస్‌ఐ వెంకన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ నాగభూషణం

ఘనంగా అయ్యప్ప పడిపూజ

చివ్వెంల : చివ్వెంల మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో మంగళవారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి మాలధారులు స్వామివారి నామస్మరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో స్వామి వారిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి గోగుల ఈదయ్య, గోగుల మహేష్, గోగుల శ్రీనివాస్, పేర్ల శ్రీనివాస్, చెరుకు మల్సూర్, అనంతుల రవి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అడుగడుగునా ఇబ్బందులు

- వానాకాలం సీజన్‌కు సంబంధించి ఇంకా పూర్తికాని ధాన్యం కొనుగోళ్లు
- ఎన్నికలు తదితర కారణాలతో ఆలస్యం
- వర్షాల వల్ల తడుస్తున్న ధాన్యం, దెబ్బతింటున్న పంటలు



అర్వపల్లిలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవకుండా రాశులపై కప్పిన పట్టాలు

అర్వపల్లి : తుఫాను మూలంగా వర్షాలు పడుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తుఫాను ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. దీంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడుస్తోంది. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులు వరి పంటలు కోసి ధాన్యాన్ని కేంద్రాలకు తెచ్చినప్పటి నుంచి పలుమార్లు అకాల వర్షాలు పడుతూనే ఉన్నాయి. దీంతో మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారు. తాజాగా తుపాను మూలంగా రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

కేంద్రాల్లోనే 1.50 లక్షల బస్తాల ధాన్యం..

జాజిరెడ్డిగూడెం మండలంలో వానాకాలం సీజన్‌కు సంబంధించి అధికారులు ఇప్పటివరకు 20 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 4.50 లక్షల బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా సుమారు 1.50 లక్షల బస్తాల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. తాజాగా తుపాను ప్రభావంతో వర్షం కురుస్తుండటంతో కేంద్రాల్లోని ధాన్యం తడుస్తోంది. అధికారులు యుద్ధ ప్రాతిపదికపై ధాన్యం కొనుగోళ్లను పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం ఆరబోయడం ఇబ్బంది అవుతుంది



అకాల వర్షాలు, తుపాను మూలంగా ధాన్యం ఆరబెట్టడానికి కూడా ఇబ్బంది అవుతుంది. ఈ సీజన్‌లో పంటలు కోసినప్పటి నుంచి వర్షాలు వెంటాడుతున్నాయి. ధాన్యం తడిసి ఆరని పరిస్థితి నెలకొంటుంది.

- సాయిని యాగానందం, రైతు, అర్వపల్లి

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



తుపాను మూలంగా వర్షాలు పడుతున్నందున రైతులు ధాన్యం రాశులపై పట్టాలు కప్పి జాగ్రత్తలు తీసుకోవాలి. తడిసిన ధాన్యం పాడవకుండా ఉప్పు నీరు చల్లి ఆరబెట్టాలి. ధాన్యం కొనుగోళ్లు వెంట వెంటనే పూర్తయ్యేలా చూస్తాం.

- శశిధర్‌రెడ్డి, ఏఓ

ప్రమాదాలకు నెలవుగా ప్రధాన రహదారి



అన్నారం గ్రామ శివారులో ఉన్న మూలమలుపు



సంగెం-అన్నారం గ్రామాల మధ్య..

- అన్నారం – సంగెం రోడ్డులో ప్రమాదకరంగా మూలమలుపులు
- కనిపించని హెచ్చరిక బోర్డులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

తుంగతుర్తి : తుంగతుర్తి మండలం అన్నారం నుంచి సంగెం గ్రామానికి వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి మూలమలుపులతో ప్రమాదకరంగా మారింది. 7 కిలో మీటర్ల దూరం ఉన్న ఈ రహదారిపై దాదాపు 30 మూలమలుపులు ఉన్నాయి. దీంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనబడక వాహనదారులు తరచు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికి తోడు ఈ దారివెంట రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు ఉన్నాయి. పైగా ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు. గతంలో ఈ రహదారివెంట ఆటోలు, బైక్‌లు బోల్తాపడి పలువురు గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను తొలగించి, ప్రమాదాల నివారణకు మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మూలమలుపుల వద్ద ప్రమాదాలను నివారించడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. మూలమలుపులు అధికంగా ఉండటంతో రాత్రి సమయాల్లో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కనిపించడంలేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను తొలగించాలి.

- బుర్ర శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి

రామాలయంలో కాంగ్రెస్ నాయకుల పూజలు

తుంగతుర్తి : అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మందుల సామేల్ విజయం సాధించడంతో మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌పార్టీని ఆదరించి గెలిపించారని అన్నారు. కాంగ్రెస్‌తో బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెండెం రాంమూర్తి, పెద్దబోయిన అజయ్, ఉప్పల రాంబాబు, అక్కెనపల్లి నరేష్, ముత్యాల వెంకటేశ్వర్లు, కటకం సూరయ్య, కటకం కృష్ణయ్య, కటకం ఉప్పలయ్య, వీరబోయిన రాములు, అక్కెనపల్లి రాములు, బత్తుల జలేందర్, ఎనగందుల సంజీవ, రమేష్, ఎల్లయ్య పాల్గొన్నారు.



కోడూరులో సంబరాల్లో పాల్గొన్న నాయకులు



తుంగతుర్తిలోని రామాలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల విజయోత్సవాలు

అర్వపల్లి : తుంగతుర్తి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేలు విజయం సాధించడాన్ని పురస్కరించుకొని మంగళవారం కోడూరు, కుంచమర్తి గ్రామాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు బాణసంచాలు కాల్చారు. రంగులు చల్లుకొని ర్యాలీలు జరిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

నూతన పంచాయతీల్లోనూ కాంగ్రెస్‌కే ఆధిక్యం

చిలుకూరు : తెలంగాణ ప్రభుత్వం 500జనాభా గల గ్రామాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ఈ గ్రామపంచాయతీల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఆశించిన ఫలితాలు వస్తాయని ఆ పార్టీ నాయకులు అంచనాలు వేసుకున్నారు. కాని మండలంలోని నూతన గ్రామ పంచాయతీల్లో ఎక్కడ కూడా ఆధిక్యం రాలేదు. మండలంలోని జానకీనగర్ గ్రామపంచాయతీ నుంచి దూదియాతండా గ్రామాన్ని, జెర్రిపోతులగూడెం గ్రామపంచాయతీ నుంచి కొమ్ముబండతండాను, కొండాపురం గ్రామం నుంచి మాధవగూడెం, ఆర్లెగూడెం పంచాయతీ నుంచి రామ్‌చంద్రానగర్ గ్రామాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. ఈ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకే ఎక్కువ లీడ్ వచ్చింది. దూదియాతండాలో 315, రామ్‌చంద్రానగర్‌లో 99, మాధవగూడెంలో 4ఓట్లు బీఆర్‌ఎస్ కంటే కాంగ్రెస్‌కు అధికంగా వచ్చాయి. కొమ్ముబండతండాకు సంబంధించిన పోలింగ్ కేంద్రం జెర్రిపోతులగూడెం పరిధిలో ఉంది. అక్కడ కూడా కాంగ్రెస్ పార్టీకే లీడ్ వచ్చింది.